అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 05 మార్చి 2023

కోతుల దాడిలో వృద్ధురాలు మృతి



నవతెలంగాణ-రామారెడ్డి

కోతుల దాడిలో గాయపడిన వృద్ధురాలు శనివారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చారిత్రబోయిన నరసవ్వ (70) ఇంట్లో ఉండగా.. శుక్రవారం ఇంట్లోకి వచ్చిన కోతులు ఆమెను దాడి చేయడంతో కుటుంబీకులు హుటాహుటిన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది.

పెద్దకొడప్గల్ ఎస్ఐగా కోనారెడ్డి



నవతెలంగాణ-పెద్దకొడప్గల్

పెద్దకొడప్గల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కోనారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్సై కోనారెడ్డి మాట్లాడుతూ మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీరుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎస్ఐ.. ఎమ్మెల్యే హన్మంత్‌షిండేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐని మండల ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

దరఖాస్తులు వందల్లో.. మంజూరు నాలుగైదు

- మైనార్టీ రుణాల తీరు
- మండలానికి 4, 5 యూనిట్లు మాత్రమే కేటాయింపు
- దరఖాస్తులు చేసుకున్నవారిలో అర్హులందరికీ ఇవ్వాలని లబ్ధిదారుల విన్నపాలు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముస్లిం మైనారిటీ రుణాల్లో ఏడాదికింత కోత పెడుతుండటంతో లబ్ధిదారులు ఆవేదనకు గురవుతున్నారు. చదువుకు తగ్గ ఉద్యోగాలు కల్పించకపోగా.. ఉపాధి లేక చిరువ్యాపారం చేసుకుందామంటే రుణాలు అందడం లేదని వాపోతున్నారు. ఒక్కో మండలంలో వందలాది మంది రుణాల కోసం దరఖాస్తులు చేసుకుంటే కేవలం నాలుగైదు యూనిట్లు మాత్రమే కేటాయిస్తుండటంతో మిగిలిన వారికి నిరాశ తప్పడం లేదు. యూనిట్లతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్నవారందరికీ రుణాలు ఇవ్వాలని కోరుతున్నారు.

ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం ఎన్నో చేస్తున్నామని ప్రగల్భాలు పలికే పాలకులు ఒక్కొక్క మండలానికి నలుగురు, ఐదుగురికి మాత్రమే సబ్సిడీతో కూడిన రుణాలను అందజేయనున్నారు. దీనిలో జిల్లాలోని అన్ని మండలాలలో గత నెల జనవరి ఐదో తేదీ వరకు మైనార్టీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. మైనారిటీ కార్పొరేషన్ నుండి రుణాలను పొందాలని ఎన్నో ఏళ్ల నుండి ఆశలతో ఉన్న ముస్లిం మైనారిటీలు హడావిడి చేసి మీ సేవ కేంద్రాల నుండి ఆదాయం సర్టిఫికెట్లను పొంది దరఖాస్తులను చేసుకున్నారు. లక్ష, రెండు లక్షల యూనిట్లుగా కేటాయించారు. లక్ష రూపాయల రుణానికి 80 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనుండగా.. 20 శాతం బ్యాంకులు లేక స్వతహాగా డబ్బులు బ్యాంకులతో నిమిత్తం లేకుండా చెల్లించుకునే వేసులుబాటు కల్పించారు. 2 లక్షల రుణానికి 70 శాతం ప్రభుత్వ సబ్సిడీ మిగతా 30 శాతం బ్యాంకుకు సంబంధం లేకుండా లాబ్ధిదారు డు కార్పొరేషన్ లకు చెల్లిస్తే లక్ష, రెండు లక్షల చెక్కును అందజేయనున్నారు. ఇంత వరకు బాగాను ఉన్నా.. రుణాల కేటాయింపు పట్ల లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మండలానికి మూడు నుంచి నాలుగు మాత్ర మే కేటాయి స్తుండటంతో మిగతా వారికి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తు న్నారు.

నిజామాబాద్ రూరల్ నియోజ కవర్గంలో ఏడు మండ లాలైన డిచ్‌పల్లిలో 230, సిరికొండ 62, ఇందల్‌వాయి 111, జక్రాన్‌పల్లి 64, మోపాల్ 147, ధర్పల్లి 86, నిజామాబాద్ రూరల్ 179 మంది ముస్లిం మైనారిటీలు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లాలోని 27 మండలల్లో మొత్తం 13,105 మంది నిరుద్యోగులు, వ్యాపారం చేసుకోవడానికి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. కానీ రుణాలు మాత్రం 100 నుంచి 120 మందికి అందనున్నాయి. ఇందల్‌వాయి మండలం వ్యాప్తంగా 111 దరఖాస్తులు వస్తే నాలుగు యూనిట్లు మాత్రమే మంజూరు అయ్యాయి. అందులో ముగ్గురికి లక్ష రూపాయలు, ఒకరికి మాత్రమే రెండు లక్షల యూనిట్ అందనుంది. డిచ్‌పల్లి మండలంలో లక్షవి మూడు, రెండు లక్షలవి రెండు యూనిట్‌లు మంజూరు అయ్యాయి.

మైనర్టీల్లో ఎక్కువ కుటుంబాలు పేదరికంలోనే మగ్గుతున్నాయి. విద్యా, ఉద్యోగంలో సైతం వీరు వెనుకబడే ఉన్నారు. ప్రభుత్వాలు ద్వారా వచ్చే సబ్సిడీ రుణాలు తీసుకొని చిరు వ్యాపారం పెట్టుకొని కుటుంబాలను పోషించుకుందామనుకుంటే కేవలం నలుగురైదుగురికి రుణాలు కేటాయింస్తూ చేతులు విదిలిస్తున్నారని వాపోతున్నారు. ఏన్నో అశాలతో దరఖాస్తులు చేసుకుంటే సబ్సిడీ రుణాలు అందని ద్రాక్ష గానే మిగిలిపోతున్నా యని కుమిలిపోతున్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ లేని రుణాలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా ముద్ర ఇతరత్రా రుణాలు తీసుకుందామంటే బ్యాంకులు సైతం గుర్తించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు బ్యాంకులు అనేక కొర్రీలు పెడుతున్నాయని వాపోతున్నారు. ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూడకుండా దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి అందరికీ రుణాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

రైల్వేలో ఉద్యోగాల పేరుతో టోకరా

- న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- పోలీసుల అదుపులో నకిలీ ఉద్యోగి


మోసపోయిన బాధితులు


నిందితుడు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి అమాయక ప్రజలకు ఓ యువకుడు కుచ్చుటోపి పెట్టాడు. ఒక్కొక్కరి నుంచి 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు దోచుకున్నాడు. దీంతో బాధితులు లబోదిబోమం టున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నవీపేట్ మండలం ఫకీరాబాద్ కు చెందిన నరేష్ అనే యువకుడు నగరంలో రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అమాయక ప్రజలను మోసం చేశాడు. ఒక్కొక్కరి నుంచి డబ్బులు దండుకొని వారికి సౌత్ సెంట్రల్ రైల్వే పేరిట డూప్లికేట్ ఐడి కార్డులు ఇచ్చి, మోసాలకు పాల్పడ్డాడు. ఉద్యోగాలు రాకపోవడంతో నిరుద్యోగులు నరేష్‌ను నిలదీయ డంతో పరార్ అయ్యాడు. అయితే శుక్రవారం రైల్వే స్టేషన్ ప్రాంతంలో బాధితులు, నరేష్‌ను గుర్తించి పట్టుకొని, వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో అప్పచెప్పారు. అయితే ఇప్పటివరకు జిల్లాలో చాలామంది అమాయక ప్రజలకు ఉద్యోగాల పేరుతో మోసం చేసినట్లు బాధితులు వాపోయారు. 50 వేల నుంచి లక్ష వరకు తాము ఉద్యోగాలు వస్తాయాని కట్టమని, తీరా చూస్తే అది అబద్ధమని తెలియడంతో మా డబ్బులు కావాలని అడిగితే తప్పించుకు తిరుగుతున్నాడని తెలిపారు. కొంతమందికి ఉద్యోగాల పేరుతో మూడు నెలల పాటు వివిధ ప్రాంతాల్లో పనిచేయించాడని, కనీసం జీతాలు కూడా ఇవ్వలేదని వారి గోడును వెళ్లగక్కారు. సుమారు తాము 25 మంది వరకు బాధితులుంటామని అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



కేజీబీవీని సందర్శించిన స్టేట్ టీం


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని కెజిబివిని శనివారం స్టేట్ అబ్జర్వర్ సంజీవ్‌రావ్, రాష్ట్ర విద్య శాఖ సభ్యులు శ్రీనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలు ఏప్రిల్‌లో ఉన్నందున ప్రణాళిక ప్రకారం చదవాలని 10 జి పి ఏ వచ్చేలా ప్రయత్నం చేయాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి వేణుగోపాల్ శర్మ, మండల విద్యాశాఖ అధికారి లింగంపేట్ శ్రీ రామస్వామి , ఎల్లారెడ్డి మండల విద్యాధికారి శ్రీ వెంకటేశం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చిరంజీవులు పాల్గొన్నారు.

సరోజనమ్మకు అపూర్వ గౌరవం

- మహిళా దినోత్సవం పురస్కరించుకొని సన్మానించనున్న గవర్నర్



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బోధన్ డివిజన్ గౌరవాధ్యక్షురాలు గుర్రాల సరోజనమ్మకు అపూర్వ గౌరవం దక్కింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మార్చి 6వ తేదీనా రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళ సై సన్మానించనున్నారు. ఈ మేరకు సరోజనమ్మకు ఆహ్వానం అందింది. ఆమె సేవ కార్యక్రమాలకు అరుదైన గౌరవం దక్కిందని, తమ సంఘానికి ఎంతో ప్రతిష్టాత్మకమని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి రాజు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో శనగ పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని శనివారం మండల వ్యవసాయ అధికారి రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగబాట రైతులు తమ పంటను మద్దతు ధర కేంద్రంలో అమ్ముకొని సద్వినియోగం పంచుకోవాలని కోరారు. మద్దతు ధర కొనుగోలు కేంద్రానికి రైతులు శనగ పంట కోసం టోకెన్ ఇవ్వడానికి మండల ఏఈవోలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు శనగ కాంట చేయాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రియాంక, ఎఫ్‌పిఓ అధ్యక్షుడు చాట్ల గోపాల్, సొసైటీ సిబ్బంది సునీల్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షిండే

నవతెలంగాణ-పెద్దకొడప్గల్

మండలంలోని అంజని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బలరాం ఇటీవల కరెంటు షాక్ తో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. పార్టీ అన్ని విధాల అండదండగా ఉంటుందని అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. షిండే వెంట ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పండరినాథ్, ఉప సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్ ,సొసైటీ డైరెక్టర్ సాయ గౌడ్, రంజిత్ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ దందా ఆపండి

- భూగర్భ జలాలను కాపాడాలి
- కలెక్టర్‌కు, ఎస్పీకి, భూగర్భ జలవనరుల శాఖకు కుర్లా గ్రామస్తుల వినతి



నవతెలంగాణ-మద్నూర్

నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల పరిధిలోని కుర్ల గ్రామ శివారు ప్రాంతంలోని మంజీరా నది నుండి అక్రమ ఇసుక దందా కొనసాగుతుందని రోజుకు వందలాది లారీలు ఓవర్ లోడుతో అనుమతులు లేకుండా తరలిస్తున్నారని అక్రమ ఇసుక దందాను ఆపి భూగర్భ జలాలను కాపాడాలని కుర్లా గ్రామస్తులు కోరారు. శనివారం కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే మంజీరా నదిలో అనుమతులు ఎక్కడ ఉన్నాయో కానీ ఇష్టానుసారంగా అక్రమ తవ్వకాలతో ఇసుక బకాసురులు ప్రతిరోజు 5 నుండి 6 లారీలను ఇసుక తవ్వకాలు జరిపి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరపడంతో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లల్లో నీరు తగ్గుతున్నాయని అన్నారు. అక్రమ తవ్వకాలు జరుగుతుండగా కొత్తగా తవ్వకాలు జరిపేందుకు రహదారులు వేస్తున్నారని రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తవ్వకాలు అక్రమంగా జరుగుతుంటే సంబంధిత శాఖల అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అక్రమ తవ్వకాల పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు.

ధరణిటౌన్‌షిప్‌లో తక్కువ ధరకే ప్లాట్‌లు

జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శనివారం ధరణి టౌన్షిప్ ప్రీ బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. 44 నెంబర్ జాతీయ రహదారి పక్కన ధరణి టౌన్షిప్ లో ఉన్న గృహాలు, ప్లాట్లను తక్కువ ధరకే పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధరణి టౌన్షిప్ లో మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. వేలంలో పాల్గొనేవారు రూ.10,000 కలెక్టర్, కామారెడ్డి పేరిట ఈఎండి చెల్లించాలని సూచించారు. రోడ్లు, విద్యుత్ సౌకర్యం, కల్వర్టుల నిర్మాణం, రక్షణ గోడ నిర్మాణం పనులు చేపడతామన్నారు. 15 రోజుల్లో పనులను పూర్తి చేయి స్తామని పేర్కొన్నారు. డిటిసిపి లేఔట్ కలిగిన ప్లాట్లు, గృహాలను ఎన్నారైలు కొనుగోలు చేయవచ్చని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు, ఉద్యోగులు సద్విని యోగం చేసు కోవాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ కలెక్టర్ చంద్రమోహన్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రాజీవ్ స్వగృహ ఏజిఎం సత్యనారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

న్యాయ సహాయం పొందొచ్చు

- ఫారెస్ట్ కార్యాలయంలో లేడీస్ రెస్ట్ రూమ్ ప్రారంభించిన జిల్లా జడ్జి



జిల్లా జడ్జితో అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని వర్ని చౌరస్తా ప్రాంతంలో గల జిల్లా ఫారెస్ట్ కార్యాలయంలో లేడీస్ రెస్ట్ రూమ్‌ను నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల శనివారం ప్రారంభించారు. అంతకు ముందు నిజామాబాద్ జిల్లా ఫారెస్ట్ కార్యాలయానికి వస్తున్న నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాలకు నిజామాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారి వికాస్ మీనా సిబ్బంది కలిసి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా నిజామాబాద్ జిల్లా జడ్జి ఫారెస్ట్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. లీగల్‌గా ఎలాంటి అవసరం ఉన్నా అడగవచ్చని తెలిపారు. అలాగే ఏమైనా సమస్యలు ఉన్న ఎలాంటి ఇబ్బందులు ఉన్న సిబ్బందిని అడిగి క్లారిఫై చేసింది. ఎప్పుడైనా సరే లీగల్‌గా ఎలాంటి అవసరం ఉన్న వాటిని నివృత్తి చేసుకునేందుకు రావచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఫారెస్ట్ అధికారి వికాస్ మీనా వారి తోటి సిబ్బంది కలిసి జిల్లా జడ్జి సునీత కుంచాలకు బహుమతిని బహుకరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎఫ్‌డీవో రామ్ కిషన్, ఎఫ్ ఆర్ ఓ పద్మారావు, నిజాంబాద్ రేంజ్ ఆఫీసర్స్ మొత్తం రెండు డివిజన్ లో రేంజ్ ఆఫీసర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


లేడీస్ రెస్ట్ రూం ప్రారంభిస్తున్న జడ్జి

బిడ్డతో కలిసి దూకిన తల్లి

- భర్త మరణం తట్టుకోలేక.. అపార్ట్‌మెంట్ నుంచి దూకి బలవన్మరణం
- స్పాట్‌లో తల్లి, చికిత్స పొందుతూ బిడ్డ మృతి
- పెద్దకూతురుని దత్తత తీసుకోవాలని సూసైడ్‌నోట్


అనూష (ఫైల్ ఫొటో)


చికిత్స పొందుతూ మృతిచెందిన శ్రీకృత

నవతెలంగాణ-కంఠేశ్వర్

వారి సంసారం అన్యోన్యంగా సాగింది. అంతలో ఊహించని విధంగా భర్త గుండెపోటుతో మృతిచెందడంతో భార్య తట్టుకోలేకపోయింది. భర్త లేని తాను జీవించలేనని చిన్న బిడ్డతో కలిసి అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుంచి దూకింది. తల్లి ఘటనా స్థలంలోనే మృతిచెందగా.. చిన్నారికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ నగరంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ లింబాద్రి, స్థానికుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్‌కు చెందిన జటాల అనూష(27)కు నాలుగేండ్ల క్రితం శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. వీరు ప్రస్తుతం కరీంనగర్‌లో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుర్లు శ్రీకృత(1), శ్రీహిత ఉన్నారు.

వివరాలు మెయిన్‌లో..

పరిశ్రమల అభివృద్ధికి ఐటీ హబ్ ఒక ఆరంభం

- ఇక నిజామాబాద్‌కూ పరిశ్రమలు వస్తాయ్
- తుదిదశకు పనులు.. త్వరలో ప్రారంభం : ఎమ్మెల్సీ కవిత


మ్యాప్‌లో పనుల వివరాలు కవితకు వివరిస్తున్న ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

'పరిశ్రమల అభివృద్ధికి ఐటీ హబ్ ఒక ఆరంభం లాంటిది. ఇంకా ఎన్నో పరిశ్రమలు నిజామాబాద్‌కు రానున్నాయి. నిజామాబాద్ యువతకు శుభ వార్త. త్వరలో ఐటీ హబ్ ప్రారంభిస్తాం. ఐటీ హబ్‌ల నిర్మాణానికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని' ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ నగరంలో ఐటీ హబ్ పనులను అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తతో కలిసి శనివారం సందర్శించారు. ఐటీ హబ్ వెబ్‌సైట్‌పై టీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేశ్ గుప్త ఎమ్మెల్సీకి వివరించిన అనంతరం కవిత వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.



వివరాలు మెయిన్‌లో..

ఎమ్మెల్సీ కవితకు ఘన సన్మానం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ పర్యటన నిమిత్తం హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా మార్గమధ్యంలోని డిచ్‌పల్లి వద్ద శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రూరల్ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ షేక్ నయీమ్, సొసైటీ డైరెక్టర్ సతీష్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన సిలివేరి గంగాధర్ కుటుంబ సభ్యులను ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ శనివారం పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో చిలువేరి గంగాధర్ మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ముత్యాల సునీల్ కుమార్ మృతుని కుమారుడు సిలివేరి గంగాప్రసాద్, కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యాన్ని కల్పించారు. మృతుడు గంగాధర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట సునీల్ సేన సభ్యులు పాలేపు నరసయ్య, నల్ల గణేష్ గుప్తా, దూలూరు కిషన్ గౌడ్ తదితరులున్నారు.

మహిళా శక్తి గొప్పది

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చీరలు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళ శక్తి గొప్పదని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీరామ గార్డెన్స్‌లో మెప్మా ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశావర్కర్‌లకు ఆత్మీయ సన్మానం నిర్వహించి చీరలు పంపిణీ చేశారు. నగర మేయర్ దండు నీతూ కిరణ్‌ను, మాజీ మేయర్ ఆకుల సుజాతను సన్మానించారు. అనంతరం సహా పంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. మహిళ సోదరిమణులందరికి అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో భాగంగా మెప్మా ఆర్పీలు కీలకమన్నారు. అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులకు పోషకాహారం లోపం రాకుండా, అలాగే చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. కరోనా మొదటి దశలో బయట మంచి నీరు దొరికే పరిస్థితి లేదని, అటువంటి సమయంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది మీ ప్రాణాలు పణంగా పెట్టి నిజామాబాద్ నగర ప్రజల కోసం పనిచేశారని, మీరు పని చేసినన్ని రోజులు మా నాన్న స్మృతిలో మీ వద్దకే భోజన వితరణ చేశానని గుర్తుచేశారు. అలాగే నిజామాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా నూతన మున్సిపల్ భవనం, స్థానిక యువతకు ఐటీ రంగంలో ఉపాధిని కల్పించాలనే ఉద్దేశంతో ఐటీ హబ్‌ను నిర్మిస్తున్నామని, అతి త్వరలో ఐటీ హబ్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, మాజీ రెడ్కో ఎస్ ఏ అలీం, బీఆర్ఎస్ కార్పొరేటర్‌లు, బీఆర్ఎస్ మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేవిధంగా చుడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరేవిధంగా కలిసి కట్టుగా పనిచేయాలని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. శనివారం ధర్పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పారిశుధ్యం తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులతో, అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సైఫొద్దీన్, జూనియర్ అసిస్టెంట్ దాసు, వార్డు సభ్యులు, అంగన్వాడీలు, మహిళా సంఘాలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాల వల్ల ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న వారికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బట్టాపూర్ గ్రామానికి చెందిన మధురిమకు 70వేలు, ఏర్గట్లకు చెందిన అట్ల ఎల్లోజికి 30 వేలు, షేక్ అఫీసా బేగంకు 55 వేలు, తొర్తి గ్రామానికి చెందిన నర్సుబాయికి 40వేలు వచ్చినట్టు తెలిపారు. చెక్కులను అందుకున్న లబ్ధిదారులు మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జక్కని మధు సూధన్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు సున్నపు అంజయ్య, ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు గుల్లే గంగాధర్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, కట్కం సాగర్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బద్దం ప్రభాకర్, సహదేవ్, లక్కం నర్సయ్య, పిట్ల నరేష్, జైనోద్దీన్, దేవుడు నర్సయ్య, మూడ్ గంగారాం, కూతురు సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

రేపు మైనార్టీలకు రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

2022-23 సంవత్సరానికి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 6న 10:30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మల్లేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అన్నీ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

పెన్షన్ అందుతుందా..? ఎంపీడీవో ఆరా



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని మల్యాపూర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఎంపీడీవో మల్లేష్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడి 'పెన్షన్ సకాలంతో అందుతుందా.. లేదా'? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు నాయక్, సెక్రెటరీ సంతోష్, బీపీఎం చంద్రం తదితరులున్నారు.

గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై భారం వేయడం దుర్మార్గం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మోడీ సర్కారు వంట గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై భారం వేయడం దుర్మార్గమని రాష్ట్ర అరుణోదయ అధ్యక్ష కార్యదర్శులు నాగన్న, దాసు అన్నారు. శనివారం మోడీ సర్కార్ సిలిండర్ ధరలను పెంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

నుడా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా చేతుల మీదుగా శనివారం నుడా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మేయర్ దండు నీతు కిరణ్, జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విట్టల్‌రావు, డి.ఎస్.పిడబ్ల్యూసిడి చైర్మన్ ఆకుల లలిత, నుడా అడ్వైసరీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గౌడ సంఘం సభ్యులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన గౌడ సంఘ సభ్యులు శనివారం ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మిగిలిపోయిన వాటికి నిధులను మంజూరు చేయాలని విన్నవించారు. వీటన్నింటిని సానుకూలంగా విన్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమస్యలను పరిష్కరిస్తామని మిగిలిన పనులకు నిధులు మంజూరు చేయడానికి తనవంతు కృషి చేస్తానని గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు బిరిష్‌శెట్టి గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, మాజీ సర్పంచ్ ఎ.గంగాగౌడ్, నర్సాగౌడ్, శంకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మురళి గౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీ నాగరాజు 60వ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో సీపీ, పోలీసు అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కె.ఆర్.నాగరాజు 60వ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పోలీస్ సిబ్బంది, ఆర్మ్డ్ రిజర్వు విభాగం సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, పోలీస్ కార్యాలయం సిబ్బంది, టి.ఎన్.జి.ఓస్ నాయకులు, ఐ.ఎమ్.ఎ అసోసియేషన్ సిబ్బంది ఇతరులు సీపీని కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సీపీని ఘనంగా సన్మానించారు.

ఘనంగా విజయసాయి హైస్కూల్ వార్షికోత్సవం

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని విజయసాయి హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలలో పనిచేస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని వారి అనుభవాలను వివరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని, అదేవిధంగా చదువుకున్న ఈ పాఠశాలలో ముఖ్య అతిథులుగా పాల్గొనే అవకాశం పొందాలని సూచించారు. అనంతరం పలు సినిమా పాటలపై విద్యార్థులు చేసిన నృత్యాలు అహుతులను ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాలలో సందడి నెలకొంది. కార్యక్రమంలో మేనేజర్ ఐఆర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు సువర్చల, ప్రసూన, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయండి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాలికల పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, నగర అధ్యక్షులు ఎస్కే అషర్ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 500 మంది పైగా విద్యార్థినులతో జిల్లా ప్రధాన కేంద్రంలో ఉన్న కోటగల్లి గర్ల్స్ స్కూల్లో కనీసం మూత్రశాలలు, తరగతి గదులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. సుమారు పది సంవత్సరాలుగా అనేక సందర్భాల్లో, అనేక రూపాలుగా ఈ స్కూలు సమస్యలు ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేసినా ఇప్పటికీ కనీస మార్పు లేకపోవడం దుర్మార్గమన్నారు. గత సంవత్సరం ఇదే పాఠశాలలో వర్షం పడి గోడలకు విద్యుత్ ప్రసరించి, విద్యుత్ షాక్‌తో ఒక విద్యార్థి మృతి చెందాడని అన్నారు. విద్యార్థులకు అనేకసార్లు ప్రమాదాలు జరిగాయన్నారు. ఇప్పటికీ తరగతి గదులు లేకపోవడం, సరిపడా మూత్రశాలలు లేకపోవడం ప్రధాన సమస్యలన్నారు. ఏ క్షణాన ఏ గది కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుడు నాసిరకం భోజనం పెడుతూ, ప్రశ్నించిన విద్యార్థినులపై, ఉపాధ్యాయులపై జులుం ప్రదర్శిస్తున్నాడన్నారు. బంగారు తెలంగాణ అని గొప్పలు చెప్పుకుంటున్న అధికార పార్టీకి చెందిన జిల్లా ప్రజాప్రతినిధులు కోటగల్లి గర్ల్స్ స్కూల్ విద్యార్థినుల బాధలు చూసి సిగ్గుపడాలన్నారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే గణేశ్ గుప్త, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారులు స్పందించి వెంటనే పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలన్నారు. తక్షణమే మౌలిక సదుపాయాలన్నిటిని కల్పించాలన్నారు. పాఠశాల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలను మరింత తీవ్రస్థాయిలో కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, జిల్లా నాయకులు మహిపాల్, మనోజ్, తిరుమలేష్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వాస్తవాలు తెలుసుకోని మాట్లాడు..

- మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై తీన్మార్ మల్లన్న వాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- బీఆర్ఎస్ పార్టీ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-ముప్కాల్

తీన్మార్ మల్లన్న వాస్తవాలు తెలుసుకోని మాట్లాడాలని, మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముప్కాల్ ఎంపీపీ భర్త, పార్టీ సీనియర్ నాయకులైన సామ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై తీన్మార్ మల్లన్న మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండించారు. వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని హితవుపలికారు. బాల్కొండ నియోజకవర్గానికి రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్న వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముప్కాల్ మండల కేంద్రానికి దాదాపు ఇప్పటివరకు రూ.18 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఆధారాలతో విలేకరుల సమావేశంలో చూపించారు. సదరు న్యూస్ ఛానల్‌ను సంప్రదించిన వ్యక్తి గతంలో ఆయన వేంపల్లి సొసైటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో కోట్ల రూపాయల కుంభకోణంకు పాల్పడిన విషయం తీన్మార్ మల్లన్నకు తెలియదా? అని జడ్పీటీసీ భర్త పార్టీ సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి సూటిగా ప్రశ్నించారు. నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలని, ఒకవైపు విని అవాస్తవాలు మాట్లాడితే సహించేది లేదన్నారు. గంజాయి కేసులో కానీ, సంతోష్ రెడ్డి కేసు విషయంలో గాని మంత్రికి ఎలాంటి సంబంధాలు లేవన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మచ్చలేని నాయకుడిగా ఎదుగుతున్న వేళ కొందరి అసత్య ప్రచారం వల్ల మంత్రికి ఒరిగేదేమీలేదన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన సంఘం నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునురు చక్రపాణి డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం హమాల్‌వాడీలో జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో మాట ఇచ్చి సంవత్సరమైందని, అమలు చేసి రెండు నెలలు అవుతుందని, ఇంతవరకు బడ్జెట్ కేటాయించలేదన్నారు. కార్మికులను మభ్యపెట్టి కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలంటే వెంటనే అమలు చేయాలని, అదేవిధంగా మిగతా సమస్యలన్నీ పరిష్కరించాలని ఈనెల ఆరో తారీకు నుంచి 12వరకు, మండల కేంద్రాల్లో, 13న జిల్లా కేంద్రం కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తామన్నాము.



మాట్లాడుతున్న చక్రపాణి

బొజ్జ భూమాగౌడ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ బొజ్జ భూమాగౌడ్ రెండవ వర్ధంతి
- సందర్భంగా నివాళి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బొజ్జ భూమాగౌడ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో బొజ్జ భూమాగౌడ్ రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే భూమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ..

కామ్రేడ్ బొజ్జ భూమాగౌడ్ చివరి శ్వాస వరకు పార్టీ, గీతా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ భూమి పంపిణీలో, మోస్రా గ్రామంలో ఇండ్ల స్థలాల పంపిణీకై కీలక పాత్ర పోషించారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేంతవరకూ పోరాటాలు నిర్వహించాలని గుర్తు చేశారు. బొజ్జ భూమాగౌడ్ ఆశయ సాధన కొరకు కార్యకర్తలు కృషి చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, ఎ.రాజేశ్వర్, దక్షిణ మండల కార్యదర్శి పి.రంజిత్‌కుమార్, నాయకులు ఆనంద్, శ్రీను, రాధాకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని జగదాంబ తండా పంచాయతీలో ఉపాధి పనులు కొనసాగుతున్నందున కూలీలు బ్యాంకు ఎకౌంట్‌కు ఆధార్ లింక్ చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లు అఫ్రోజ్, సంగమేశ్వర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగదాంబతండా పరిధిలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఎకౌంటుకు ఆధార్ లింకు చేసుకోవాలని, ఉపాధి పనులపై ఆసక్తి కనబరచుకునేవారు డిమాండ్ ఫామ్స్ అందజేసి, కూలి పనులను సద్వినియోగ పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఎస్‌లో వైజ్ఞానిక పరీక్షలు



నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు శనివారం సైన్స్‌ఫేయిర్ ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు చేపట్టిన వైజ్ఞానిక ప్రదర్శనలను పాఠశాల డైరెక్టర్లు రాజారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సతీష్, ప్రధానోపాధ్యాయుడు చిల్యాల నర్సయ్యలు పరిశీలించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన చేపట్టిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



నవీన్‌కుమార్ తల్లి సాయవ్వను ఓదారుస్తున్న రాజు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రనికి చెందిన కాంగ్రెస్ పార్టీకార్యకర్త పత్తి నవీన్‌కుమార్ ఆకస్మికంగా మరణించగా.. బాధిత కుటుంబాన్ని పార్టీ మండల అధ్యక్షుడు తూర్పు రాజు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా తూర్పు రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అనునిత్యం పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ ఉండే నవీన్ అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమని నవీన్‌కు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. నవీన్ తల్లి సాయవ్వకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ సంగానీ బాబా, సొసైటీ డైరెక్టర్ గాండ్లా లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు పత్తి శ్రీకాంత్, పెంటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని టీచర్స్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఈజీఎస్ 10 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణం పనులను గ్రామ సర్పంచ్ సురేష్ ఎంపిటిసి సభ్యురాలు సంగీత కుశాల్ శనివారం ప్రారంభించారు. ఉపాధి హామీ ఈజీఎస్ ద్వారా మంజూరైన 10 లక్షల నిధులతో టీచర్స్ కాలనీ హౌసింగ్ బోర్డ్‌లో కాలనీ ప్రజల అవసరాల కోసం సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ సురేష్, ఎంపిటిసి సభ్యురాలు సంగీత కుశాల్ తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణం పనుల ప్రారంభోత్సవంలో ఎంపీటీసీ సాయిలు, ఉప సర్పంచ్ విట్టల్, ఎంపిటిసి అనూషబాయి, కుటుంబ సభ్యులు శివాజీ బీఆర్ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి రచ్చ కుశాల్, సొసైటీ డైరెక్టర్ రాజు, గుత్తేదార్ హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టాస్ వేస్తున్న ఎస్ఐ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో మద్నూర్ ప్రీమియర్ లీగ్ ఎంపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం గ్రామ సర్పంచ్ సురేష్ ఎస్సై కృష్ణారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ యువకులకు ఎంతో ఉత్సాహపరుస్తుందని పేర్కొన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో యువకులంతా శాంతియుతంగా కలిసిమెలిసి ఆటలు ఆడుకోవాలని వారు సూచించారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఎస్సై కృష్ణారెడ్డి టాస్ ఎగిరేసి ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో టోర్నమెంట్ నిర్వాహకులు గ్రామ ఉపసర్పంచ్ విట్టల్, ఎంపీటీసీలు వీరితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న గంగావేణి

నవతెలంగాణ-బోధన్

అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా సాలూర మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ గంగావేణి మాట్లాడుతూ.. గృహహింస, ఫోక్సో, నిర్భయ చట్టం, మహిళల హెల్ప్‌లైన్ 181 నెంబరుకు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చని అన్నారు. సమాజంలో అందరూ సమానమేనని లింగ భేదంపై వివక్షత చూపరాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, అంగన్వాడీ టీచర్లు సునీత, గంగామణి, మాధవి, గోదావరి, సరోజ, మహిళలు పాల్గొన్నారు.

సమయంకంటే ముందే చేరుకోవాలి

- ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
- పరీక్షల నిర్వహణపై అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్.. హాజరైన అధికారులు

పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షలు ఈ నెల 15 నుండి ఏప్రిల్ 04 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 .00 గంటల నుండి మధ్యాహ్నం 12 .00 గంటల వరకు కొనసాగనుండగా, పదవ తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 03 నుండి 12 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 .30 గంటల నుండి మధ్యాహ్నం 12 .30 గంటల వరకు జరుగనున్నాయి. 10 వ తేదీన జరిగే ఎస్సెస్సి సామాన్య శాస్త్రం (పార్ట్-1 ఫిజికల్ సైన్స్, పార్ట్-2 బయోలాజికల్ సైన్స్) పరీక్ష ఉదయం 9 .30 నుండి మధ్యాహ్నం 12 .50 గంటల వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. పదవ తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 21,707 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో 21590 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉండగా, 117 మంది ప్రైవేట్ అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ కోసం 138 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. అదేవిధంగా ఇంటర్మీడియేట్ పరీక్షలకు మొత్తం 35017 మంది హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 4354 మంది ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారని అన్నారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 54 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పరీక్ష ప్రారంభం అయ్యే నిర్ణీత సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని హితవు పలికారు. ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను ఆయా రూట్ ల వారీగా పోలీసు బందోబస్తు మధ్య తీసుకెళ్లాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, తగిన పోలీసు బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసిఉంచాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనెలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో నియమించాలన్నారు. వేసవి తీవ్రత అంతకంతకు పెరుగుతున్న దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను, ఫస్ట్ ఎయిడ్ కిట్లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, అత్యవసర సమయంలో వినియోగించేందుకు వీలుగా 108 అంబులెన్సు సిబ్బందిని కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. కోవిడ్ నిబంధనలు అమలయ్యేలా చూడాలని, ఎగ్జామ్ సెంటర్స్ లోని గదులను శానిటైజెషన్ చేయాలన్నారు. ప్రతి కేంద్రంలోను సరిపడా బెంచీలు, డ్యూయల్ డెస్క్ లు ఇతర ఫర్నీచర్ అందుబాటులో ఉంచాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలూ కల్పించాలని అన్నారు. పరీక్షలు కొనసాగే సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గదుల్లో తగినంత వెలుతురు, సీలింగ్ ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు ప్రారంభం కాకముందే పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత మండలాల ఎంపీడీఓలు ఎగ్జామ్ సెంటర్ లను సందర్శించి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు రవాణా పరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేకించి మారుమూల గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలలో సీ.సీ కెమెరాల పనితీరును ముందుగానే పరిశీలించుకోవాలని, ప్రశ్న పత్రాల బండిళ్లను సీ.సీ కెమెరాల రికార్డింగ్ నడుమ సీల్ విప్పాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించనందున విద్యార్థులు సెల్ ఫోన్స్, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్ వంటివి వెంట తేకూడదని హితవు పలికారు. ఇన్విజిలేటర్ లు కూడా పరీక్ష కేంద్రం లోపల సెల్ ఫోన్ వాడకూడదని అన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన నియమ,నిబంధనలపై ముఖ్య పర్యవేక్షకులు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు శిక్షణ ఏర్పాటు చేయాలని ఎస్ ఎస్ సీ, ఇంటర్ అధికారులను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘురాజ్, డీ ఈ ఓ దుర్గా ప్రసాద్, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ విజయ్ భాస్కర్, డీ ఎం హెచ్ ఓ డాక్టర్ సుదర్శనం, డీ పీ ఓ జయసుధ, ఎం హెచ్ ఓ సాజిద్, కలెక్టరేట్ పరీక్షల విభాగం సూపరింటెండెంట్ పవన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు చట్టసభల్లో స్థానం కల్పించాలి



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

చట్ట సభల్లో ముదిరాజ్‌లకు పార్టీలు స్థానం కల్పించాలని అదేవిధంగా ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బట్టు విఠల్ కోరారు. ఎల్లారెడ్డి మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామంలో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో శనివారం ముదిరాజ్ సంఘ జెండాను ఆవిష్కరిం చారు. ముదిరాజ్ కుల అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ముదిరాజ్‌పై ఉందని అన్నారు. ముదిరాజ్‌లలో చాలా మంది కుటుంబాల పరిస్థితి ఆర్థికంగా వెనుకబడిన వారు ఎక్కువగా ఉన్నారని, కాబట్టి అవసరమైన చోట మత్స్యకార సంఘాల్లో చోటు కల్పించాలని అన్నారు. బిసి డి నుండి బీసీ ఏ కు ముదిరాజ్ లను మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం జి ఓ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన కులం ముదిరాజ్ అని, పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు తప్ప ఏ పార్టీలు ముదిరాజ్‌లకు న్యాయం చేయటం లేదని అన్నారు. ముదిరాజ్‌లందరు ఒక్కటై వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ ముదిరాజ్ లందరు ఐక్యతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు తూర్పు రాజు, మల్లయ్య పల్లి సర్పంచ్ ఎల్లయ్య, రెపల్లె వాడ సర్పంచ్ సాయిరాం, సంఘ నాయకులు కోర్న నారాయణ, శ్రీకాంత్ , సంతోష్, అశోక్ , అంజయ్య గ్రామ సంఘ సబ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

నవతెలంగాణ-దోమకొండ/ సదాశివనగర్



దోమకొండలో మాట్లాడుతున్న జడ్పీటీసీ



సదాశివనగర్‌లో..

మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, ఎంపీపీ కానుగంటి శారదలు అన్నారు. శనివారం దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ సఖి సెంటర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, ఎంపీపీ కానుగంటి శారదలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఉత్తమ ప్రతిభతో రాణిస్తుతున్నారని సమాజంలో స్త్రీలను లింగ బేధం లేకుండా చూడాలని, స్త్రీ పురుషులు అందరూ సమానమేనని స్త్రీలు అన్ని రంగాలలో రాణించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లపు అంజలి, తహసీల్దార్ కౌశిక, ఎంపీడీవో చిన్నారెడ్డి ఏఎస్ఐ సుబ్రహ్మణ్యచారి ఏపీఎం రాజు, వివిధ శాఖల అధికారులు అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ముగ్గుల పోటీలు

సదాశివనగర్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసిడియస్ కామారెడ్డి ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీ టీచర్‌లకు ముగ్గుల పోటీ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురష్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివనగర్ ఎంపిపి గైని అనుసూయ మాట్లాడుతూ మహిళలు ఎందులో తక్కువ కాదని అన్నారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన అంగన్‌వాడీ టీచర్లకు ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజు న జిల్లా కేంద్రం లో బహుమతులు అందిస్తారని సి.డి.పి.ఓ శ్రీలత తెలిపారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ వంకాయల రవి, ఎంపిటిసి బీరయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, సూపర్ వైజర్ పద్మ పాల్గొన్నారు.

పరీక్షలంటే భయమొద్దు.. ప్రణాళికతో చదవాలి



మాట్లాడుతున్న డీఈవో రాజు

- జుక్కల్ జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన డీఈవో రాజు

నవతెలంగాణ-జుక్కల్

పరీక్షలంటే భయపడొద్దని, ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రాజు విద్యార్థులకు సూచించారు. జుక్కల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం కామారెడ్డి జిల్లా డీఈవో రాజు ఆకస్మికంగా సందర్శించారు. జుక్కల్ మారుమూల ప్రాంతంలోని పిల్లలతో అసెంబ్లీలో పాల్గొనడం, వారి క్రమ శిక్షణకు మంత్రముగ్ధు లయ్యానని తెలిపారు. గత ఐదు రోజులుగా మిడే మీల్స్‌ను స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు పరిశీలించడంతో మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు తెలిపారు. మండలంలోనే ఉత్తమంగా మిడ్ డే మీల్స్ అందిస్తున్నారని సర్వేలో తేలిందని, జుక్కల్ హెచ్ఎమ్‌కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టీచర్ అవార్డు రావడం , ఉపాధ్యాయులు కష్టపడుతున్నారని, తగిన ఫలితం కూడా వారికి ఇవ్వనున్నట్టు తెలిపారు.

పదవ తరగతి విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలని, ఆధైర్యపడవద్దని , ఉత్తమవఫలితాలు సాధించి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని సూచించారు. అనంతరం జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు డీఈవోను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు, ఎసివో కామారెడ్డి లింగం, హెచ్ఎం బస్వంత్ రావ్ పటేల్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలం లోని హల్మాజీ పూర్ గ్రామంలో శనివారం ఎంపిపి మాధవి బలరాజ్ గౌడ్ సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఉపాదిహామీ పథకం ద్వారా 5 లక్షల సిసి రోడ్డు పనులు ప్రారంభించిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, జడ్పీటీసీ ఉష గౌడ్, వైస్ ఎంపిపి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు



విరాళాలు అందజేస్తున్న డాక్టర్ కిషన్ దంపతులు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని జగదాంబ తండా వీరాంజనేయ ఆలయ భూదానము నిమిత్తం భక్తులు భారీగా విరాళాలు అందజేసినట్లు ఆలయ అర్చకులు తేజ స్వామి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన డాక్టర్ కిషన్ 11 వేల రూపాయలు విరాళంగా అందజేయగా పెద్దకొడప్గల్ మండల కేంద్రానికి చెందిన విష్ణుమూర్తి 5 వేల రూపాయలు, కీర్తిశేషులు కోట శ్యాం కుమార్ కుటుంబ సభ్యులు 5 వేల రూపాయలు విరాళాలుగా అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

డబుల్ నిర్మాణానికి భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో సర్పంచ్ నాగరాజు డబల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ లబ్ధిదారుడు కర్రే పోచయ్య ఇంటికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఏ ఈ కృష్ణ ,ఉప సర్పంచ్ సుజాత రాజు గ్రామ పెద్దలు మల్లారెడ్డి, సంగారెడ్డి,లక్ష్మయ్య , గంగారం తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ శిక్షణకేంద్రాన్ని తనిఖీ చేసిన డైరెక్టర్



నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న న్యాక్ శిక్షణ కేంద్రాన్ని డైరెక్టర్ సత్యపాల్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఎంతమంది శిక్షణ తీసుకుంటున్నారని పూర్తి వివరాలను ఇంచార్జీ దిలీప్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న వారిని పలు విషయాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణ కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంచార్జీకి సూచించారు. ఈయన వెంట జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్, రమేష్, రుచిత, ఓంకార్ తదితరులున్నారు.

ప్రమాదకరపు మూలమలుపు వద్ద కారు బోల్తా

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- స్వల్ప గాయాలతో బయటపడ్డ ఆ నలుగురు

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి అతిసమీపంలో పెద్దమ్మ ఆలయం వద్ద గల ప్రమాదకర మూలమలుపువద్ద శనివారం సాయంత్రం కారు బోల్తా పడింది. కారు ధ్వంసమవగా.. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి పెనుప్రమాదం తప్పిందని ఎస్ఐ వంశీ కృష్ణ రెడ్డి తెలిపారు. భీంగల్ గ్రామానికి చెందిన గాడి అమర్ కుటుంబం హైదరాబాద్‌లో నివాసముంటోంది. హెూలీ పండగ సందర్భంగా స్వగ్రామానికి ధర్పల్లి మీదుగా వెళ్లే క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కారు వేగం అధికంగా ఉండటంతో మూలమలుపు ఉన్నట్టు గమనించకపోవడమే ప్రమాదానికి కారణమైనట్టు తెలిసింది. ఈ ప్రమాదంలో భార్య సుస్మిత, ఇద్దరు చిన్నపిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానిక ఆసుపత్రిలో చూపించుకొని ఇంటికి వెళ్లినట్టు తెలిపారు.

దేశాయి యాజమాన్యంతో చర్చలు సఫలం

- టేకేదార్‌ను మందలించిన రేంజ్ మేనేజర్
- కార్మికుల విజయం: సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-వర్ని

దేశాయి బీడీ కంపెనీ మోస్రా సెంటర్ పరిధిలోని కొత్తపేట్ కార్ఖానాలో బీడీ కార్మికుల సమస్యలపై శనివారం 'తెలంగాణ బీడీ, సిగార్స్ వర్కర్స్ యూనియన్' (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, కోశాధికారి నన్నేసాబ్, రేంజ్ మేనేజర్, సెంటర్ మేనేజర్ సమక్షంలో చర్చలు జరిపారు. టేకేదార్ చేసిన తప్పులను గుర్తించిన యాజమాన్యం ఆయనను గట్టిగా మందలించింది. బీడీ కార్మికులు పెట్టిన షరతులను తాము అంగీకరిస్తున్నామని యాజమాన్యం చెప్పడంతో చర్చలు సఫలమయ్యాయని బీడీ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. దేశాయి బీడీ కంపెనీలో టేకేదార్ల దోపిడి ఎక్కువైందని టేకేదార్లు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. కొత్తగా పీఎఫ్ నెంబర్‌కు తీసుకున్న రూ.6వేలు తిరిగి ఇప్పిస్తామని, తూకంలో తేడాలు లేకుండా నాణ్యమైన ఆకు, తంబాకు ఇస్తామని, కార్ఖానా ఇంట్లో కాకుండా వేరే చోటికి తరలిస్తామని, తదితర సమస్యల పరిష్కారానికి యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. తాను చేసిన తప్పులను ఒప్పుకొని, భవిష్యత్తులో తప్పు జరగదని, జరిగితే తనపై యాజమాన్యం చర్యలు తీసుకోవచ్చునని టేకేదార్ గంగాధర్ ఒప్పందపత్రం రాసిచ్చారని అన్నారు. ఇది కార్మికుల విజయమని, ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి నన్నేసాబ్, బీడీ కార్మికులు వసంత, పద్మ, సునీత, విజయ, లావణ్య, మణిరేణుక, రూప, సావిత్రి, మౌనిక, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



బీడీ కార్మికులతో నాయకులు

పలు కాలనీల్లో కుక్కల పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగారు. ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా నగరంలోని నూతన అంబేద్కర్ భవన్లో మున్సిపల్ అధికారులతో కుక్కల పట్టివేతపై, పాఠశాలలో అవగాహన సదస్సులపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా అనంతరం మున్సిపల్ అధికారులు పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అందుతున్న ఫిర్యాదుల మేరకు దశల వారీగా డాగ్స్ క్యాచింగ్ టీమ్ సందర్శిస్తోందని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా, యం.ఏ.అలీమ్, అసిస్టెంట్ కమిషనర్, ఎమ్‌హెచ్ఓ సజీద్ అలీ, ఆర్వో నరేందర్, డి.ముస్తాక్ అహమ్మద్, ఏఈ ఇనాయత్ కరీం, శానిటేషన్ ఎస్ఐలు నటరాజ్‌గౌడ్, ప్రశాంత్, శ్రీకాంత్, సునీల్, మహిపాల్, ప్రభుదాస్, ఆర్‌పిలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బీమా మంజూరి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలానికి చెందిన మోండూర్ వీరయ్య, బెల్లాల్ గ్రామం కాపర్ల వరమ్మ, జలాల్‌పూర్ గ్రామం నెమ్లి సాయిలు గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు చనిపోవడంతో వారికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున బాధిత కుటుంబ సభ్యులకు శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ ప్రమాద బీమా మంజూరి అయిన పత్రాలను అందించారు. కార్యక్రమంలో సాలూర గ్రామ నాయకులు సుభాష్, బెల్లల్ తిరుపతి, వీరేష్, యాదు తదితరులున్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

- దొరికిన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగింత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ నుంచి సిరికొండ వెళ్లే ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు తన విలువైన సెల్ఫోన్‌ను బస్సులో మరిచిపోయాడు. అది గమనించిన కండక్టర్ భూమయ్య ఆ ఫోన్‌ను భద్రంగా తన వద్ద ఉంచుకొని ఫోన్ పోగొటుకున్న బెజ్జోరా గ్రామానికి చెందిన వ్యక్తికి శనివారం అందజేసినట్టు బస్టాండ్ కంట్రోలర్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా నిజాయితీతో సెల్‌ఫోన్‌ను అప్పగించిన కండక్టర్ భూమయ్యను పలువురు అభినందించారు.

ప్రారంభమైన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేముల సురేందర్‌రెడ్డి స్మారక ఆర్మూర్ డివిజన్, ఉమ్మడి బాల్కొండ మండల స్థాయి "ఓపెన్ టు ఆల్ షటిల్ బ్యాడ్మింటన్" డబుల్స్ క్రీడా పోటీలను శనివారం సాయంత్రం మండల ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు కొనసాగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల ప్రవీణ్, గంగుల నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ బ్రమ్మదండి సువర్ణ లింగం, శ్రీనివాస్ గౌడ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

4వ రోజు క్రీడలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆన్వల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2023 శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ గ్రౌండ్‌లో నిర్వహించినట్టు సీపీ కె.ఆర్.నాగరాజు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నారాయణ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా హ్యాండ్ బాల్ సంఘం హడక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ జట్టు ఎంపికలో మంచి ప్రతిభ కనబరిచిన నారాయణ హై స్కూల్ క్రీడాకారుడు అభినయ్ ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపాల్ గోపీనాథ్, వ్యాయామం ఉపాధ్యాయురాలు రజిత శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ హై స్కూల్ విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటలలో కూడా రాణిస్తున్నారని నారాయణ స్కూల్ జిల్లా సంస్థల ఏజీఎం శివాజీ ఎంపికైన క్రీడాకారుడిని మెచ్చుకుంటూ, క్రీడలకు ప్రోత్సహిస్తున్న పి.ఈ.టి. రజితను అభినందించారు. ఈనెల 10,11,12 తేదీలలో పట్టణంలోని ఆల్‌ఫోర్స్ నరేంద్ర హైస్కూల్‌లో జరగబోయే తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ క్రీడా పోటీలలో ఈ క్రీడాకారుడు పాల్గొననున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతను సాధించాలి

- డీఈఓ దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న డీఈవో

నవతెలంగాణ-మాక్లూర్

విద్యార్థులు 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణతను సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్ తెలిపారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతాన్ని, పలు రికార్డులను పరిశీలించారు. వంటశాలను, సామన్లను భద్రపరుచు గదిని తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతను సాధించే విధంగా చర్యలు చేపట్టాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థినీలు నిద్రించు గదులకు కిటికీలు చెడిపోవడంతో వాటిని బెస్ట్ రూమర్స్ ఫౌండేషన్ అమెరికా వారు ముందుకు వచ్చి రిపేర్ చేయిస్తుండటాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిని ప్రగతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు ముఖ్యమే

- ఆర్డీఓ రాజేశ్వర్

నవతెలంగాణ-బోధన్

పాఠశాలలో చదివే విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో శరీర దారుడ్యానికి ఆటలు అంతే ముఖ్యమని కావున ప్రతి విద్యార్థి ఇష్టమున్న ఆటలలో పాల్గొని విజయం సాధించాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని బీటీ నగర్ పాఠశాల కాంప్లెక్స్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న 15 పాఠశాలల విద్యార్థులకు విజేతలైన వారికి శనివారం ఆర్డీఓ బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విద్యార్థి దశలో ఆడే ఆటలు మర్చిపో లేనివని కావున ఆటలలో ఓడినా, గెలిచినా నిరాశ చెందకుండా, ఓటమిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. అనంతరం విజేతలకు మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగనాథ్, సీఐ ప్రేమ్‌కుమార్, మండల నోడల్ అధికారి నాగయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్.వి.ఎన్ గౌడ్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కోటగల్లిలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సొసైటీ అధ్యక్షులు కొట్టాల రవీందర్ కోరారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. సొసైటిలో రికార్డులు తనిఖీలు చేసి, సీఈవోకు పూర్తి చేయమని కోరినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. పీఏసీఎస్ బాధ్యతలు చేపట్టి నెల గడిచినా క్యాష్ బ్యాలెన్స్ వివరాలు చూపడం లేదని అన్నారు. క్యాష్ బ్యాలెన్స్ రూ.3,77,000 ఉందని దానికి పొంతనా లేని సమాధానం చెపుతున్నాడని ఆరోపించారు. ఎరువులు, బియ్యంకు సంబంధించిన రూ.4,80,000 వారి స్వంతానికి వాడుకోని మిగిలిన సంచులు చూయించడం లేదని అన్నారు. గతంలో (2021) రబీ రైతుల డబ్బులు చెల్లించలేదని దీనిపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని అన్నారు. బిల్డింగ్ ఖర్చులలో డీసీఓ, పాలకవర్గ సభ్యుల అనుమతి లేకుండా 8,00,000 పై చిలుకు ఖర్చు చేశారని ఆరోపించారు. సీఈఓ రాజు, క్యాషియర్ భాస్కర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ నూతన చైర్మన్‌కు మంత్రి వేముల శుభాకాంక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ నూతన చైర్మన్ తారిఖ్ అన్సారీ రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని మినిస్టర్ క్వార్టర్స్‌లోని అధికారిక నివాసంలో మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. తనకు సహకరించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తారిక్ అన్సారీకి మంత్రి వేముల పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్ తినిపించి ఆల్ ది బెస్ట్ చెప్పారు. నిజామాబాద్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అయిన తారిఖ్ అన్సారీని ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తారీక్ అన్సారీ వెంట ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు ఉన్నారు.

పార్టీలకు అతీతంగా ఆర్థిక సహాయం చెక్కులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల వారికి ఆర్థిక సహాయం చెక్కులు మంజూరు చేయిస్తూ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేదవారికి అండగా ఉంటున్నారని బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగం గంగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అమీర్‌నగర్ గ్రామంలో ఏర్గట్ల గంగమణికి గర్భసంచి ఆపరేషన్ అయినందుకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.25వేల చెక్కును స్థానిక గ్రామ పంచాయతీ వద్ద లబ్ధిదారు భర్త ముత్తెన్నకు గంగం గంగారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుప్పాల గంగాధర్, ఉపసర్పంచ్ తోట జ్యోతి ప్రసాద్, బీఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు మెరుగు శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాలవత్ ప్రకాష్, వార్డ్ సభ్యుడు క్యాతం గంగారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాజేందర్, జిల్లా రవి, వర్ణం శ్రీధర్, మోహన్, లింబాద్రి, రఘు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్/జక్రాన్‌పల్లి/మాక్లూర్

మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను స్థానిక జడ్పీటీసీ సభ్యురాలు బద్దం నర్సవ్వ ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ మట్ట సందీప్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా మన రాష్ట్ర మంత్రి ప్రశాంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, బద్దం నర్సరెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ఉప సర్పంచ్ రమేష్, స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మహేష్, నిమ్మల నర్సయ్య, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని బాలనగర్ గ్రామపంచాయతీలో 10లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ కుంచాల విమల రాజు శనివారం భూమిపూజ చేశారు. సర్పంచ్, టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

మాక్లూర్ : మండల కేంద్రంలోని కృష్ణ నగర్ క్యాంప్‌లో సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ బి.అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో రోడ్డు పనులు ప్రారం భించినట్టు తెలిపారు. బీఆర్ఎస్ గ్రా మ కమిటీ అధ్య క్షులు తజోద్దీన్, శ్రీనివాస్, నాయకులు దర్గాల సాయి లు, పెద్దలు, రమణ, హరి, కరీం పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి

- డీఆర్డీఏ డీఆర్డీఓ పీడీ చందర్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని ఇదే కాకుండా ఇతర వ్యాపారాలు కూడా జిల్లా సమాఖ్యకు ఆదాయం వచ్చే విధంగా నిర్వహించుకోవాలని డీఆర్‌డీఏ, డీఆర్‌డీఓ పీడీ చందర్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని టెక్నికల్ ట్రైజం శిక్షణ కేంద్రంలో ఇందూరు జిల్లా మహిళా శాఖ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో పప్పు దినుసులు యూనిట్లో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని పప్పు దినుసుల యూనిట్ ఏర్పాటుకు తొందరగా స్థలాన్ని ఎంపిక చేసి ప్రొడక్షన్‌ను మొదలు పెట్టే విధంగా చూడాలని, దీంతో జిల్లా సమాఖ్యకు ఆదాయం వచ్చే విధంగా ఉంటుందన్నారు. వ్యవసాయానికి సంబంధించిన వ్యవసాయ పనిముట్లు, హార్వెస్టర్, గడ్డి కోసే యంత్రం, గడ్డి చుట్టే యంత్రం, ట్రాక్టర్‌కు మిగిలిన పనిముట్లు కొనుగోలు చేసి ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు కూడా కమ్మర్‌పల్లిలో 100శాతం టార్గెట్ పూర్తి చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని మండలాల్లో పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడి మధుసూదన్, డిపియం ఐబి శ్రీనివాస్, ఏపీఎం సరోజన, డిపిఎం మారుతి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

వార్త ఫోటో పేట్టాండి

మన ఊరు మనబడి పనుల ఆకస్మిక తనిఖీ..

మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో మన ఊరు మనబడి పనులను డీఆర్డీఏ డీఆర్డీఓ పీడీ, మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్ శనివారం ఆకస్మికంగా సందర్శించి పనుల తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు మన ఊరు మన బడి పథకం కింద ఆరు లక్షల రూపాయలు మంజూరయ్యాయని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సమయానుసారం పనులను పూర్తి చేసే విధంగా చూడాలని సంబంధిత శాఖ ఏఈ, ఎంపీడీవో గోపి బాబు, ఇన్చార్జి ఎంపీవో నిట్టు కిషన్ రావుకు ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న పీడీ

'డబుల్' ఇండ్లు పంపిణీ చేయకుంటే మేమే పంచుతాం

- మాజీ మంత్రి కొండ విశ్వేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31 వరకు డబుల్ బెడ్ రూములను లబ్దిదారులకు పంపిణీ చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామని చేవెళ్ల మాజీ మంత్రి కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బీజేపీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో పేదోళ్లకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకై మహా ధర్నా నిర్వహించారు. ఈ మహా ధర్నాకు ముఖ్య అతిథిగా చేవెళ్ల మాజీ మంత్రి కొండ విశ్వేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు.

తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఉండేదని, ఇప్పుడు అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసిఆర్‌కే దక్కుతుందన్నారు. దళితులకు మూడెకరాలు భూమి ఇస్తానని, దళిత బంధు ఇస్తానని మాయ మాటలు చెప్పి నట్టేట ముంచాడన్నారు. చదువుకున్న వాళ్ళందరిని మోసం చేసి ఉద్యోగాలు ఇవ్వకుండా తన కుటుంబానికి మాత్రం పదవులు ఇచ్చుకున్నారని, రైతులను ధరణి పోర్టల్ ద్వారా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. తెలంగాణకు ఆర్థికంగా కల్వకుంట్ల రోగం వచ్చిందని, తెలంగాణ ద్రోహులు తప్ప ఆ పార్టీలో ఎవరూ ఉండరని ఏద్దేవా చేశారు. ప్రభుత్వ భూములు అమ్ముకుంటూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించుతున్నారని అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తే చదువుకున్న యువత, మహిళలు, రైతుల, గోసలు చూస్తుంటే టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల బాధలను గాలికి వదిలినట్టు అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, పల్లె గంగారెడ్డి, న్యాలం రాజు, రాజశేఖర్, విజయ భారతి, శివ, కైసర్, సుధీర్, స్వామి, నాగుల, శంకర్, మెడిపాటి ప్రకాష్‌రెడ్డి, స్రవంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మిర్ధాపల్లి విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని టీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ఆర్‌లో జిల్లాస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ సెలక్షన్‌లో మిర్ధాపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికలో పాల్గొన్నారు. ఈ హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన గణేష్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేష్ శనివారం తెలిపారు. ఈ ఎంపిక పట్ల సర్పంచ్ సొడ సాయిలత మధు వర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

యంచలో ఆంజనేయ చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని యంచ గ్రామంలో శ్రీ కొట్టాల లక్ష్మి రామన్న గార్ల జ్ఞాపకార్థం వారి మనుమడు కొట్టాల సుభాష్ శ్రీ ఆంజనేయ చలివేంద్రాన్ని శ్రీ ఓం స్వర్ణకమల లక్ష్మి అమ్మ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాసర సరస్వతి దేవస్థానం మార్గంలో వేసవిలో వెళ్ళ ప్రయాణికుల దాహార్తులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇందూరు హరీష్, ఉపసర్పంచ్ నాగురావు, మాజీ సర్పంచ్ లింగారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన ఏళ్లసరం ధర్మయ్యకు మంజూరైన రూ.22వేల చెక్కును సర్పంచ్ రాజేందర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, ప్రదీప్, సుధాకర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శనివారం మధ్యాహ్నం జరిగిన బీఈడీ 3వ సెమిస్టరు (రెగ్యులర్) పరీక్షలో 1296 మంది విద్యార్థులకు గాను 1260 మంది హాజరయ్యారని, 36 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరిక్షల నియంత్రణ అధికారిణి ఎం.అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 462 మంది నమో దు చేసుకోగా 438మంది హాజరయ్యారని, 24మంది విద్యార్థులు గైర్హాజర య్యారని, మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 1వ సెమిస్టరు రెగ్యులర్ పరీక్షలో 562 మంది విద్యార్థులకు గాను 531 మంది పరీక్షకు హాజరు కాగా, 31 మంది గైర్హాజరు అయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణా ఒక ప్రకటనలో తెలిపారు.